క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందించిన ఎంపీ


ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

మంత్రాలయం: మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత సీతారామిరెడ్డిని శుక్రవారం అనంతపురం జిల్లా హిందుపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కలిశారు. 21వ తేదీన జరిగే తన అన్న కుమార్తె వివాహ వేడుకకు హాజరుకావాలని పెండ్లి పత్రికలు వారికి ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, కురువ సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు కురువ మద్దిలేటి, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మంత్రాలయం : మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చిన అనంతపురం జిల్లా హిందుపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కురువ సంఘం నాయకులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిశారు. ముందుగా శాలువా కప్పి సన్మానించారు. అనంతనం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా కార్యానిర్వహక అధ్యక్షుడు మద్దిలేటి, మండల అధ్యక్షులు కురువ మల్లికార్జున, ఉపాధ్యాక్షుడు వీరనాగప్ప, నాయకులు యల్లప్ప, నరసింహ, యాదగిరి, లింగప్ప, మలయ్య, భీమయ్య, రాఘవేంద్ర, బసవరాజు,కర్నూల్ దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రత కారణంగా ఎర్రతెగులు


మాట్లాడుతున్న నాగసరోజమ్మ

మంత్రాలయం రూరల్: భూమిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా పత్తి పంటకు ఎర్రతెగులు వచ్చిందని వాటికి నివారణగా 20.20.0.13 లేదా28.28.0, 14.35.14 ఎరువును ఒక లీటరు నీటిలో 5 గ్రాములు కలుపుకొని పిచికారీ చేయాలని జిల్లా వనరుల కేంద్రం, ఆత్మ అధికారిణి నాగసరోజమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం చిలకలడోణ రైతు బరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం, ఆత్మ సంయుక్తంగా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిణి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటకు 30 రోజులు కావడంతో తెల్ల, పచ్చదోమలు ఉధ్రుతంగా ఉంటాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ నివారణకు వేప నూనె ఒక లీటరు నీటిలో 5ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ గణేష్, ఏఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్

ఆదోని రూరల్ : ప్రభుత్వం అందజేసే పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని విరుపాపురం గ్రామ సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని విరుపాపురంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు కిట్లను అందిస్తుందన్నారు. ఇందులో 3 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, అర లీటర్ వంటనూనె, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, చిక్కీలను అందిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశమ్మ, అంగన్‌వాడీ వర్కర్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ చిన్న పీరయ్య

ఆదోనిరూరల్ : మండలంలోని హానవాల్ గ్రామ పంప్‌హౌస్ వద్ద శుక్రవారం ఓ వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులను చూసి మద్యాన్ని, మోటార్ సైకిల్‌ను వదిలి పారిపోయాడని పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. 90 ఎంఎల్ పరిమాణం 272 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. విచారణలో కౌతాళం మండలం కరణికి చెందిన కురులే శివగా తెలిసిందని, ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సాంకేతికత... చేరువ!

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన డిజిటల్ విద్య
- 60 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున స్మార్ట్ టీవీ
- ఆడియో, వీడియోల ద్వారా విద్యాబోధన
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


ఐఎఫ్‌పీ ద్వారా విద్యను అందిస్తున్న ఉపాధ్యాయురాలు

ఆదోని సెంట్రల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. బడికి పిల్లలను పంపే ఏ తల్లీ ఆర్థిక ఇబ్బంది పడకూడదని అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రభుత్వం విద్య, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా నాడు–నేడ పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పించింది కూడా. ఈ నేపథ్యంలో బోధనలోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. డిజిటల్ విద్య విధానానికి చర్యలు చేపట్టింది.

– ఆదోని పట్టణం, గ్రామీణ ప్రాంతంలో పురపాలక, ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలు 130 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 57,421 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మొదటి విడతగా నాడునేడు పనులు చేసుకున్న పాఠశాలలకు ఐఎఫ్‌బీ, స్మార్ట్ టీవీలను సరఫరా చేసింది. ఆదోని నియోజకవర్గంలో 53 ప్రాథమిక పాఠశాలలకు 60 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున 140 స్మార్ట్ టీవీలను సరఫరా చేసింది. 42 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్, ప్యానెళ్లను సరఫరా చేసింది. పాఠశాలలో సంఖ్య మేరకు అక్కడ ఏర్పాటు చేసిన సెక్షన్లను పరిగణలోకి తీసుకొని ఐఎఫ్‌పీ టీవీలను తరగతి గదులలో అమర్చారు. డిజిటల్ విద్యను అందుబాటులోకి తేవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ప్రభుత్వ బడులలో చదువుతున్న విద్యార్థులను అత్యున్నత స్థాయి భోదన అందించి ఉన్నతులుగా తీర్చి దిద్దాలనీ ప్రభుత్వం సంకల్పించింది. 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు అందించే విధంగా చర్యలు చేపట్టారు అధికారులు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో అడియో, వీడియోల ద్వారా అకట్టుకునే విదంగా విద్యబోధన కొనసాగిస్తారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల ద్వారా డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. డిజిటల్ విద్య విధానం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విడియోలో ముందుగా రికార్డు చేసిన పాఠాలతో సహా స్టడీ మెటిరియల్‌ను ఆన్‌లైన్‌లో యాక్సెస్ చేసుకోవచ్చు. సెల్ ఫోను లేదా పెన్‌డ్రైవ్, ఇంటర్‌నెట్ వంటివాటితో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను అందించనున్నారు.

ఎంతగానో ఉపయోగపడుతుంది



పాఠశాలకు ఇంటరాక్టివ్ ఫ్యాక్ట్ ప్యానెళ్లను సరఫరా చేశారు. వాటిని అన్ని తరగతి గదులలో ఏర్పాటు చేశాం. త్వరలో ఇంటర్నెట్ సౌకర్యం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లు నుండి ఐఎఫ్‌పీలకు అటాచ్ చేసుకొని విద్యార్థులకు విద్యను అందిస్తారు. ఒక వేళ విద్యుత్ సరఫరా లేకపోయిన బోర్డు ద్వారా విద్యను అందించే విధంగా ఏర్పాట్లు చేశాం.విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– మల్లికార్జున ప్రధానోపాధ్యాయులు

డిజిటల్ విద్యాబోధన బాగుంది



పాఠశాలల్లో ప్రభుత్వం అందించిన డిజిటల్ ఐఎఫ్‌పీ టీవీ ద్వారా విద్యను అందిస్తున్నారు. చాలా బాగుంది. బోర్డుల మీద రాసిన వాటిని గమనించడం... అర్థం చేసుకోవడానికి సమయం పట్టేది. పాఠశాలల్లో విన్నటువంటి పాఠాన్ని మరొకసారి వినడానికి ఆన్‌లైన్ సిస్టం ద్వారా అవకాశం ఉంది. పాఠం అర్థకాకపోతే విడియోల ద్వారా మరోమారు విని అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంది.

– మహాలక్ష్మి, విద్యార్థిని, పురపాలక పాఠశాల, ఆదోని

సెల్ ఫోన్లతో కనెక్ట్ చేసుకుని కూడా చెప్పవచ్చు



సెల్‌ఫోన్‌తో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌కు అటాచ్ చేసుకొని విద్యార్థులకు విద్యను అందిస్తాం. విద్యార్థులను పాఠం వైపు అట్రాక్ట్ చేయడానికి ఆడియో, విడియోలు ఎంతగానో ఉపాయోగపడుతాయి. విద్యార్థులు మనసు పెట్టి విన్న పాఠాలు మరచి పోవడానికి అవకాశం ఉండదు. చెప్పిన పాఠాలను త్వరగా గ్రహించడానికి డిజిటల్ విద్య విధానం ఉపయోగపడుతుంది.

– నరసమ్మ, ఉపాధ్యాయురాలు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి


పోలీసులతో డ్రిల్ చేయిస్తున్న అధికారులు

ఆదోనిఅర్బన్ : పోలీస్ ఉద్యోగం వత్తిడితో కూడుకున్నదని తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. స్థానికి మున్సిపల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఆదోని నియోజకవర్గంలోని ఏడు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసులతో డ్రిల్ చేయించారు. తెల్లవారు జామున 5:30 గంటల నుంచి ఆయా పోలీస్ స్టేషన్‌ల సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసులతో డ్రిల్ చేయించారు. అనంతరం డీఎస్పీ శివ నారాయణస్వామి ఆరోగ్యంపై తగు సూచనలు, సలహాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు విక్రమసింహ, శ్రీనివాసనాయక్, నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిన్నపీరయ్య, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, విజయలక్ష్మి, జయశేఖర్ పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలను సరిచేయండి

ఆదోని సెంట్రల్: బదిలీలైన ఉపాధ్యాయులకు జీతాలను అందించడానికి సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నాయని, వాటిని సరిచేసి జీతాలు విడుదల చేయాలని యూటిఎఫ్ గౌరవ అధ్యక్షులు రుద్రముని శుక్రవారం కోరారు. సీఎఫ్‌యంఎస్ నుంచి క్యాడర్ స్ట్రెంత్ సంబంధించిన వివరాలు ట్రెజరర్ కార్యాలయాలకు పంపాలన్నారు. అప్పుడే జీతాలు చెల్లించడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు.

గ్రామాల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఆదోని రూరల్ : గ్రామాల అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మండిగిరి మేజర్ పంచాయతీలోని ఉన్న రాజీవ్‌గాంధీ నగర్‌లోని బుడుగ జంగాల కాలనీలో రూ.35 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్డు ఏర్పాటు కానుండడంతో బుడగజంగాల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని, రైతులకు పంట నష్ట పరిహారం, నాయీబ్రాహ్మణులకు, రజకులకు చేయూత, ఆసరా, విద్యాదీవెన, అవ్వాతాతలకు రూ.2,750 పింఛన్, చేనేతలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మండిగిరి శేషిరెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, నాయకులు విష్ణురెడ్డి, కంబిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఉలిగప్ప, బుడగ జంగాల గోవిందు, దొమ్మరి లక్ష్మన్న, కడితోట ఈరన్న, బుడగజంగాల పెద్ద కన్నయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేదర్‌గేరిలో అక్రమ కట్టడాలు కూల్చివేత


అక్రమ కట్టడాల కూల్చివేత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్ : పట్టణంలోని 36వ వార్డు మేదర్‌గేరిలో అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, టీపీఓ శ్రీనివాసులు, వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఉద్యోగులతో పాటు వెళ్లి కట్టడాల కూల్చివేత పనులను పరిశీలించారు. రోడ్లు, పట్టణం అభివృద్ధి చెందాలంటే అక్రమ కట్టడాలను తొలగించడం తప్పనిసరి అని కమిషనర్ తెలిపారు. పట్టణాభివృద్ధిపై ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం మర్చంట్స్ క్లబ్ ఏరియాలో పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎంఐజీ కాలనీలో నీటి సరఫరా సరిగాచేయడంలేదని ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని కమిషనర్ సిబ్బందిని హెచ్చరించారు.

ఇక నుంచి డీఎల్, ఆర్‌సీ కార్డులు రావు

ఆదోనిఅర్బన్ : రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్‌సీ కార్డులు రావని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి తెలియజేశారు. స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మై పరివాహన్, డీజీలాక్ యాప్‌ల ద్వారా డీఎల్, ఆర్‌సీలు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఒకవేళ వాహనాలు తనిఖీ చేసేటప్పుడు యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న వాటిని చూపిస్తే సరిపోతుందన్నారు. డీఎల్, ఆర్‌సీ అప్లై చేసే వారికి కార్డులు ఇవ్వనందుకు రూ.250 ఫీజులో తగ్గించామన్నారు. డీఎల్, ఆర్‌సీలు రాని వాహనదారులు యాప్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు.


మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి

ప్రత్యేక హోదా కోసం పోరాడుదాం

ఆదోనిఅర్బన్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా సాధనకు పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక నాయకులు భీమ్‌రెడ్డి, ఆస్పరి వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ రాజ్‌గోపాల్‌రెడ్డి, ఆరంజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువై పోయిందని, రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు లేక సరైన విద్య, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమకు న్యాయం చేయాలని కోరారు.


ప్రత్యేక హోదా కావాలని నినదిస్తున్న నాయకులు

సక్రమంగా విధులు నిర్వర్తించండి

కౌతాళం: మహిళా పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని, బాధితులకు అండగా నిలువాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శులతో (మహిళపోలీసు) ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను ఎలా చేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అన్నారు. ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా అప్పగించి పనిని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ శోభారాణి మహిళా సంరక్షణా కార్యదర్శులు తిరుపతిబాయి, మమత, వెంకటేశ్వరమ్మ, ఉషారాణి, అమృత, సుమతిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారాజు

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక రెవెన్యూ విభాగంలో పనిచేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్–ఉర్–రెహమాన్‌కు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను ప్రభుత్వం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పీఏగా నియమించింది. దీంతో ఆయన నిర్వర్తిస్తున్న బాధ్యతలు ఖలీల్–ఉర్–రెహమాన్‌కు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన వార్డులు, రెవెన్యూ కలెక్షన్లతో పాటు బంగి అనంతయ్య మున్సిపల్ కాంప్లెక్స్, పార్కు రోడ్డు వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కిసాన్ ఘాట్, కిడ్స్ వరల్డ్, ఇండోర్ స్టేడియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి సంస్థల నుంచి బాడుగలు, బకాయిలు రెగ్యులర్‌గా వసూలు చేయాలని కమిషనర్ అందులో పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


దివ్యాంగుడు సురేష్‌కి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ పరిధిలోని 35వ వార్డులో బీఎస్ లాడ్జ్, దిపంజరాపోల్, సీఆర్ నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, 29వ వార్డులోని మరాఠీగేరిలో యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్యే 200 గడపలను సందర్శించగా, మనోజ్‌కుమార్‌రెడ్డి 400 గడపలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌తో పాటు అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే సాయి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటరీ, గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలు దేశంలోనే ఆదర్శనీయంగా నిలిచాయని, అలాంటి వ్యవస్థలపై ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గత జూలై నెలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న లక్షలాది సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు ఖర్చు చేస్తూ అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పగటివేషగాళ్ల అవతారంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వస్తారని, కల్లిబొల్లి మాటలు చెబుతారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందాయని గుర్తు చేశారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విదేశీ విద్య, రైతు భరోసా, పంట నష్టపరిహారం, చేయూత తదితర పథకాల కింద లబ్ధి పొందని వారు ఎవరైనా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచిచంఆరు. వలంటీర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎవరైనా నిర్లక్ష్యం చేసినట్లయితే వెంటనే కమిషనర్ లేదా తన దృష్టికి తీసుకొస్తే ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మాబాషా, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళా నాయకురాళ్లు ఫాతిమా, శ్రీదేవి, జిలేకాబీ, శ్రీలక్ష్మి, మురళీరెడ్డి, ఎర్రిస్వామి, సన్ని, శ్రీనివాసరెడ్డి, రామలింగేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి

సబ్సిడీ బియ్యం స్వాధీనం

ఆదోనిరూరల్: పట్టణంలోని అమరావతినగర్ బైపాస్ రోడ్డులో సబ్సిడీ బియ్యాన్ని గుర్తించిన వన్‌టౌన్ పోలీసులు సివిల్‌సప్లై అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా మూడు చోట్ల ఉన్న సబ్సిడీ బియ్యాన్ని గుర్తించారు. మొత్తం 180 బస్తాల(95.10 క్వింటాళ్లు)కు పంచనామా నిర్వహించి సివిల్ సప్లై గోదాముకు తరలిస్తామన్నారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయన్న విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని వలీబాషా విలేకరులకు తెలిపారు.

బీమా సాయం అందజేత

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన శంకర్ అనారోగ్యంతో మరణించాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలను మృతుడు భార్య ఈరమ్మకు శనివారం గ్రామ సర్పంచ్ కాశీం అంజినేయులు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

మతోన్మాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం

కౌతాళం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాదనికి వ్యతిరేకంగా ప్రతి పౌరుడు పోరాడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. కారంచేడు, చుండూరు, వేంపెంటలలో జరిగిన మానవహోమాన్ని నిరసిస్తూ దళిత మృతవీరుల సంతాపసభను మండలంలోని కుంటన హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. మృతవీరుల కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గ్రామ నాయకుడు హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో వారు మాట్లాడుతూ ఈ మరణహోమం జరిగి 40సంవత్సరాలు అయిందన్నారు. స్వాతంత్ర వచ్చి 75సంవత్సరాలు గడుస్తున్న ఆదివాసీలపై దళితులపై, మైనారిటీలపై మతోన్మాద పాసిస్టు దాడులు జరుగుతున్నాయని, వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాముడు, చంద్ర, సత్యన్నా, రాముడులు పాల్గొన్నారు.

భగవంతుడి లీలలే భాగవతం



ప్రవచనాలను వివరిస్తున్న సుస్వరం నాగరాజ ఆచార్యులు, పాల్గొన్న భక్తులు

ఆదోనిఅర్బన్ : యుగ యుగాల్లో విష్ణు పరమాత్ముడు అవతారమెత్తిన పది అవతారాల్లో చూపిన లీలలే భాగవంతలో చెప్పుకుంటున్నామని వేదపండితుడు సరస్వతరత్న విద్వాన్ సుస్వరం నాగరాజ ఆచార్యులు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ మంగరాయ సన్నిధిలో అధికమాసం సందర్భంగా శ్రీమద్భాగవత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు భగవద్గీత, భగవంతుడి అవతారాల గురించి ప్రసంగించారు. భాగవతంలో మొట్టమొ దట అవతారం వరహా అవతారమని, భూదేవిని కాపాడేందుకే విష్ణుపరమాత్ముడు ఈ ఎత్తాడని తెలిపారు. అనంతరం మత్స్య, కూర్మ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి అవతారాలు ఎత్తాడని తెలిపారు. అన్నింటిలోనూ భగవంతుడు ఉన్నాడని, ఏది జరగాలన్నా జరగకూడదన్నా ఆ భగవంతుడే కారణమని వివరించారు. అనంతరం అవతారాల గురించి భగవంతుడి లీలల గురించి, ధర్మం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నకతేశ్యామ్, వాసుదేవరావు, గురురాజ ఆచారి, బ్రాహ్మణ భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

కోసిగి: మండలంలోని నాడు–నేడు కింద మొదటి విడుత మంజూరైన అంగన్ వాడీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కోసిగి మండలంలోని వందగల్లు, దొడ్డి, నేలకోసిగి, గౌడుగల్లు గ్రామాల్లోని అంగన్‌వాడీ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు కింద ఒక్కొక్క భవనానికి రూ.16 లక్షలు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. కోసిగి మండలంలోని దుద్ది, వందగల్లు, నేలకోసిగి, గౌడుగల్లు, దొడ్డి, జంపాపురం, ఆర్లబండ గ్రామాల్లోని కేంద్రాల భవనాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే దొడ్డి గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, అంగన్ వాడీ కార్యకర్తలు పద్మ, స్వరూప, అఫ్రిన్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


దొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ నాగమణి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కాత్యాయిని

కోసిగి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కాత్యాయని పేర్కొన్నారు. శుక్రవారం కోసిగి మండలం ఐరన్‌గల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు జన్మ ఇచ్చిన నాటి నుంచి 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. గర్భం దాల్చి నాటి నుంచి నెలకోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆకు కూరలు, పండ్లు, అధిక మోతాదులో తీసుకోవాలన్నారు. కార్యకక్రమంలో రిలియన్స్ ఫౌండేషన్ ఆర్డిప్ కార్యకర్త భీమేష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్ రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈరమ్మ, సజ్జలగుడ్డం అంగన్ వాడీ కార్యకర్త భాగ్యవతి, ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిష, ఆశావర్కర్ రాధమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.